సన్మానం



గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముంగి రఘుపాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకంలో కాంగ్రెస్ నాయకులకు సరైన ప్రాతినిధ్యం లభించిందన్నారు. నాయకులు చంటిబాబు, చంద్రశేఖర్, పరమానందం, రామ్‌కుమార్, అమీద్, గోవర్ధన్‌రెడ్డి, షకీలా, వనజ, శ్యామల, హేమలత తదితరులున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి హయాంలో హైదరాబాద్ నెంబర్ వన్



మాట్లాడుతున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

గన్‌ఫౌండ్రీ: సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థాయిలో దూసుకుపోతుందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఐటీ, టూరిజంతో పాటు ప్రతిరంగం దేశంలోని అన్ని నగరాల్లో కంటే హైదరాబాద్ నగరం ముందంజలో ఉందన్నారు. సంక్రాంతి సంబరంలో భాగంగా కైట్ ఫెస్టివల్‌లో అయన పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచ వ్యాప్తంగా పెంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి అమోఘం అని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన



గౌలిపురా: శ్రీరాంనగర్ కాలనీలోని హంపీ సంస్థానం బాలాజీ అయ్యప్ప స్వామి ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ పాటిల్ సదానంద్ యాదవ్, ధర్మకర్త వీఎస్ గణేష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం, స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహించడంతో స్వామి వారి దర్శనం భక్తులకు కనుల పండువగా నిలిచింది. రాత్రి ఆలయ పరిసరాల్లో స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బండారు విజయ్ కుమార్, శ్రీరాములు, కిశోర్ కుమార్, ప్రవీణ్, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదా రంగనాథుల కల్యాణం



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గంటి సూర్యప్రభ భక్తీ సంగీత విభావరి, అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు, ఆలయ చైర్మన్ కె.యుగందర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్ట్ పి.నర్సింగ్ రావు, కర్మన్‌ఘట్ హనుమాన్ ఆలయం మాజీ చైర్మన్ నల్లా రఘుమా రెడ్డి దంపతులు, ఆలయ ఈఓ ఎస్.మహేందర్ కుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా షాహి స్నానం



లంగర్‌హౌస్: కుంభమేళా షాహి స్నానాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. లంగర్‌హౌస్‌లోని జానకీసమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయం రాంచంద్రజీ మఠం ప్రయాగ్ రాజ్‌లో అఖాడ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా కుంభమేళాలో అఖాడ నుంచి త్రివేణి సంగమానికి భక్తులు, సంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. సీతారామ లక్ష్మణుల విగ్రహాలతో, భక్తులతో కలిసి వెళ్లి షాహి స్నానాలు ఆచరించారు. లంగర్‌హౌస్ సంగం ఆధ్వర్యంలో అక్కడ నిర్వహిస్తున్న ఖాల్సాలో ఇప్పటికే దాదాపు 60 వేల మంది భక్తులు పాల్గొన్నారు.



కైట్ ఫెస్టివల్‌లో రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



దారుసలాంలో పతంగులు పంపిణీ చేసిన శాంతి దేవి



జాంబాగ్‌లో.. గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు ధనరాజ్ తదితరులు

సంక్రాంతి.. సంబురం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల పాటు జరిగిన వేడుకలు బుధవారం కనుమ పండుగతో ముగిశాయి. చిన్నారులతో పాటు యువతీ యువకులు కేరింతలు కొడుతూ సరదాగా పతంగులు ఎగురవేశారు. కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చిన్నారులకు పతంగులు పంపిణీ చేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



మీరాలంమండి ఆలయ కమిటీ ప్రతినిధి గాజుల ప్రవీణ్ కుటుంబసభ్యులు



పతంగులను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకుడు వాసు ముదిరాజ్ తదితరులు



లంగర్‌హౌస్‌లో..



మార్కండేయ నగర్‌లో..



మహేష్‌నగర్‌లో..



లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ నాయకుడు తిరుపతి శివకుమార్



బజరంగ్ సేన కైట్ ఫెస్టివల్‌లో అధ్యక్షుడు ఎన్నార్ లక్ష్మణ్‌రావు తదితరులు



అశోక్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్



టోలిచౌకీలో పతంగులు ఎగురవేస్తున్న శ్రీకాంత్‌చారి తదితరులు



విజయనగర్‌కాలనీలో..

ముగిసిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న గాజుల అంజయ్య



ముగింపు వేడుకల సందర్భంగా సన్మాన గ్రహీతలు

చార్మినార్: చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలజీ మందిరంలో ఐదు రోజుల పాటు జరిగిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేంకటేశ్వర స్వామిని దాదాపు లక్షన్నర మంది భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు. ఈ నెల 10న స్వామి వారి నేత్ర దర్శనంతో ప్రారంభమైన ఉత్సవాలు 12న నమ్మళ్వార్ పరమ పద మహోత్సవాలు, 13న గోదాదేవి కల్యాణం, 14న సంక్రాంతి పూజలు, 15న అమ్మవారికి వడి బియ్యం సమర్పించడంతో ఈసారి ఉత్సవాలు ముగిశాయని ఆయన తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పాతబస్తీ వీధుల్లో నిర్వహించిన స్వామి వారి పల్లకీ సేవ సామూహిక ఊరేగింపునకు భక్తుల నుంచి చక్కటి ఆదరణ లభించిందన్నారు. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ.. ఈసారి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ ఆలయంలో 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురిని ఆత్రేయాచార్యులు ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవం వేడుకలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో చివరగా గోదాదేవి అమ్మవారి కరినోము ఉత్సవం పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అంతకు ముందు గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం, తీర్థప్రసాద గోష్ఠి, సమ్మాల్వర్ పరమ పదోత్సవం, పల్లకీ సేవా, హారతి, శత్తు మురయ్, తొమ్మిది రకాల ప్రసాదముల గోష్ఠి, రపత్తు ఉత్సవ సమాప్తి తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రతినిధి శేషాచారి ఆధ్వర్యంలో జరుగగా ఆలయ ట్రస్టీ ఎస్‌టీ చారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ చార్యులు, బద్రినాథ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



గోదా రంగనాథస్వామి కల్యాణం



ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

సుల్తాన్‌బజార్: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్‌జోన్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసంలో భాగంగా బుధవారం సుల్తాన్‌బజార్‌లో పాదచారులకు, ఫుట్‌పాత్ ఆక్రమణ దారులకు అవగాహన సదస్సును నిర్వహించిన అనంతరం ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదచారులకు ఇబ్బంది కలిగేలా చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని సూచించారు. నో పార్కింగ్ జోన్లలో వాహనాలను పార్క్ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సుల్తాన్‌బజార్ పీఎస్ పరిధిలో ఎన్నో ఆక్రమణాలు చోటు చేసుకున్నాయని వాటిని త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్‌ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ సంపత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు

16 ఏళ్లుగా అయ్యప్ప స్వాములకు అన్నదానం

అఫ్జల్‌గంజ్: ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) హెల్ప్ ఏ నీడ్ ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా అయ్యప్ప స్వాములకు విజయవంతంగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇప్పటి వరకు తమకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. నిత్యం సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించినట్లు, దాతలు సహకారంతో మున్ముందు కూడా కొనసాగిస్తామన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నర్మద సింగ్



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నర్మద సింగ్ నియమితులయ్యారు. బుధవారం గాంధీభవన్‌లో ఆమెకు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్మదసింగ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో మహిళా శక్తిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బహుమతులు అందజేత



అఫ్జల్‌గంజ్: ముస్లింజంగ్‌పూల్ వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎమ్మెల్సీ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తమగొండ బాలమణి, సుగుణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ మునావర్

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ మునావర్ (59) ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి లేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని బిస్మిల్లా బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బేగంబజార్ చేపల వ్యాపారులకు న్యాయం చేయాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

అబిడ్స్: బేగంబజార్‌లోని చేపల మార్కెట్ స్టాల్స్‌ను గతంలో మంజూరైన గంగపుత్ర సంఘం సభ్యులైన చేపల వ్యాపారులకు కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బేగంబజార్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కౌసర్ ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. బేగంబజార్‌లో చేపల మార్కెట్ ఏర్పాటు సమయంలో 236 మంది చేపల వ్యాపారులకు స్టాల్స్ కేటాయించాలని అప్పట్లో వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. 2016లో ఈ స్టాల్స్ వారికి కేటాయిస్తామని అధికారులు హామీ కూడా ఇచ్చారని ఆయన బల్దియా కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ 236 మంది చేపల వ్యాపారులు వంశపార్యపరంగా నిజాం కాలం నుంచి బేగంబజార్‌లో చేపల వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. వారికే స్టాల్స్ కేటాయించి న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. బేగంబజార్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌సింగ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం



సోమరాజు సింగును సత్కరించిన బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తం రావు

అబిడ్స్: కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని గోషామహల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తం రావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో ఉంటున్నారన్నారు. గోషామహల్ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సోమరాజు సింగును ఆయన సత్కరించి అభినందించారు. అనంతరం పురుషోత్తం రావు మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీజేపీ ఎల్లప్పుడూ నెంబర్ వన్ స్థాయిలో ఉంటుందన్నారు. సోమరాజు సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో పరిష్కరించేందుకు నిరంతరం పాటుపడుతున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. కోట్ల అలీజాలోని కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయికోట్ బాబురాజా రూపొందించిన బోనాల జాతర నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన బుధవారం మీరాలంమండిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూన్ 25న గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించే బోనంతో ఈసారి ఆషాఢ మాసం బోనల జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌యాదవ్, యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న గాజుల అంజయ్య, రాయికోట్ బాబురాజా

ప్రత్యేక పూజలు



దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌సింగ్

గోల్కొండ: నానల్‌నగర్ సాలార్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయంలో వార్షిక పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రతి యేటా జరిగే స్వామి వారి పూజలు ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత ఆధ్వర్యంలో జరిగాయి. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఎం.నర్సింహ, బీఆర్‌ఎస్ నాయకులు టి.జీవన్‌సింగ్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, సోమారపు జనార్దన్ తదితరులున్నారు.

దర్బార్ మైసమ్మ ఆలయంలో..

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం ఆలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ..దర్బార్ మైసమ్మ దర్శనానికి పండుగ రోజుల్లో పాత నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారన్నారు. బీజేపీ నాయకులు టి.యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.